నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
శనివారం
23 మే
2026

# పేటను సస్యశ్యామలం చేయడమే ముఖ్యమంత్రి ధ్యేయం..








## మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట ప్రతినిధి, మే 22, (నినాదం):** పేద ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, యువజన సేవలు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. నారాయణపేట జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లా దుతూ....వలసల జిల్లాగా ఉన్న నారాయణపేట ను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపు 5 వేల కోట్ల రూపాయలతో మక్తల్ – నారాయణపేట –కొడంగల్ ఎత్తి పోతల పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. గతంలోఈ ప్రాజెక్ట్ కోసం దశబ్దాలుగా పోరాటం చేసినా ఫలితం శూన్యం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారం లోకి రాగానే పాలమూరు బిడ్డ ముఖ్య మంత్రి గా ఉన్నందుకు ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగి ఇప్పుడు కాట్రేపల్లి నుంచి కాన్కుర్తి వరకు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. గతంలో పాలమూరు ప్రజల జీవనం ఆగమ్యగోచరంగా ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మక్తల్– నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పూర్తయితే ఇక్కడి ప్రాంతం మరో కోనసీమ అవ్వడం ఖాయమన్నారు. పచ్చని పంట పొలాలతో ఈ ప్రాంతం సస్యశామల్యం అవుతుందన్నారు. ఇకపై నారాయణపేట జిల్లా వలసల జిల్లా కాదని వలసలను తెచ్చుకొనే జిల్లా గా మారిపోనుందని మంత్రి తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధిలో అధికారులు, ప్రజలు.. అందరి సహకారం ఉండాలన్నారు. మొదట్లో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటే ఎవ్వరూ నమ్మలేదని ఇప్పుడు గ్రామ గ్రామానా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాల పండుగలు చేసుకుంటున్నారని మంత్రి వెల్లడించారు. అర్హులైన పేదలు ఇంకా ఎవరైనా ఇల్లు లేకుండా ఉంటే వారికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల్లో సర్పంచ్ లు, వార్డ్ మెంబెర్ లు , కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లు బాధ్యత గా పని చేసి గ్రామాలను బాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు.రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ పేద వాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరి అన్నారని కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక వరి వేస్తే సిరిని చేశామన్నారు. రైతులు పండించిన వడ్లకు బోనస్ తో పాటు గిట్టు బాటు ధర ఇచ్చి మరీ కొనుగోలు చేస్తుందని గుర్తు చేశారు. ప్రతీ పేదవాడికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం రేషన్ షాప్ ల ద్వారా ఇస్తున్నామని తెలిపారు. ప్రతీ గ్రామానికి రేషన్ షాప్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బంది ఉండకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే అధికారుల పాత్ర చాలా అవసరమన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పెండింగ్ ఫైల్స్, పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అధికారులను విశ్వసించి, నమ్మి 99 రోజుల కార్యాచరణ ఇచ్చిందని, అధికారులు తమ బాధ్యత ను విస్మరించ వద్దని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే మున్సిపల్ చైర్ పర్సన్ లు, కౌన్సిలర్లు, సర్పంచులకు అధికారులు గౌరవం ఇచ్చి వాళ్ళు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. తన రాజకీయ జీవితం సర్పంచ్ నుంచే ప్రారంభమైందని చెప్పారు. ఈ సారి పంచాయతీ ఎన్నికలలో కొత్తగా ఎన్నికైన సర్పంచులలో అధికంగా యువకులే ఉన్నారని, వారి హయాంలో తమ తమ గ్రామాలకు ఏదైనా చేయాలనే తపన వారిలో ఉందన్నారు. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రావాలని మంత్రి ఆకాంక్షించారు. మహిళా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తోడ్పాటు అందించిందని మంత్రి తెలిపారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ల నిర్వహణ, ఆర్టీసి అద్దె బస్సుల నిర్వహణ చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ...రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ఫలితాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించడంతోపాటు అర్హులైన వారందరికీ పథకాలు అందించేలా గ్రామ, వార్డు సభలు జరిగాయని అన్నారు. విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణలు, వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు, అసుపత్రులను తీర్చిదిద్దే ప్రణాళికను ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. స్థలాలు ఉండీ ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నూరుశాతం అమలు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియగా సర్కారు అమలు చేయనుందన్నా రు. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి కల్పించే కార్యక్ర మాలను 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా చేపట్టనుం దనీ తెలిపారు. ఈ 99–రోజుల కార్యాచరణ ప్రణాళిక మార్చి 6న ప్రారంభమై, జూన్ 12 వరకు కొనసాగుతుందన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవమును ఘనంగా జరుపుకుంటామనీ గుర్తు చేశారు. 5 స్థాయిలలో ఈ కార్యక్రమం జరుగుతుందని, గ్రామ స్థాయి – ఏప్రిల్ 2 నుంచి, 16 న మండల స్థాయిలో, . మే 2 న నియోజక వర్గ స్థాయి, మే 22 న జిల్లా స్థాయిలో, జూన్ 2 న రాష్ట్ర స్థాయి లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు జరుగుతాయని ఆమె తెలిపారు. ఈ 99 రోజుల కార్యక్రమం లో 10 థీమ్స్ ఉంటాయనీ, 10 థీమ్స్ కోసం వివిధ శాఖలు వారి వారి అంశాల ప్రకారం ముందుకు సాగుతాయన్నారు. తొలివారం మార్చి 30 నుంచి ఏప్రిల్ 4– గ్రామీణాభివృద్ధి సంస్థ, రెండోవారం ఏప్రిల్ 6–11 – ఆరోగ్యరంగం, మూడోవారం ఏప్రిల్ 13–18 – అరైవ్ అలైవ్ పోలీసు శాఖ, నాలుగో వారం: ఏప్రిల్ 20–25 సంక్షేమం, ఐదో వారం: ఏప్రిల్ 27 నుంచి మే 2– పిల్లల భద్రత, డ్రగ్స్ అడ్డుకట్ట, ఆరో వారం: మే 4–9– రైతు సంక్షేమం, ఏడో వారం: మే 11–16– విద్యాశాఖ, ఎనిమిదో వారం మే 18–23 – యువత, క్రీడలు, తొమ్మిదో వారం మే 25–30 – మహిళా సంక్షేమం, పదోవారం జూన్ 1–6 – పర్యావరణం ఉంటాయన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత లో భాగంగా 272 గ్రామ పంచాయతి కార్యాలయాలను, 1181 ప్రభుత్వ కార్యాలయాలను, 472 కి, మీ రోడ్లను, 563 ఓ హెచ్ ఎస్ లను శుభ్రపరచనైనదనీ, 1886 కిలోల ఘన వ్యర్థాలను, 230కిలోల వ్యర్థాలను తొలగించడం జరిగిందని, 151 గ్రామ పంచాయతిలలో ఫాగింగ్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఆరోగ్యరంగం పరంగా.. మొదటి దశలో (06 మార్చి 31 మార్చి) మాతృ, శిశు, కిశోర మరియు వృద్ధుల ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించబడింది. పి హెచ్ సి లలో స్పెషలిస్ట్ క్యాంపులు నిర్వహించి ఏ ఎన్ సి నమోదు, అనీమియా నియంత్రణ, పోస్ట్ నాటల్ ఫాలోఅప్, ఆర్.బి.ఎస్.కె స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపట్టారనీ , సి పి ఆర్, మెన్రువల్ హైజీన్, మెంటల్ హెల్త్ పై ఐ ఈ సి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వృద్ధుల ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం, 14–16 సంవత్సరాల బాలికలకు హెచ్ పీ వీ టీకాలు అందించడం జరిగిందని చెప్పారు. అరైవ్ అలైవ్, సంక్షేమ శాఖ, ఇందిరమ్మ ఇండ్ల పథకం, కొత్త రేషన్ కార్డులు, మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన నిధులు, లబ్ధిదారుల వివరాలను కలెక్టర్ వివరించారు. కాగా కార్యక్రమంలో భాగంగా అంతకు ముందు రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సీ ఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, నారాయణ పేట , మక్తల్, కోస్గి మున్సిపల్ చైర్ పర్సన్ లు కొండా శ్వేతా సత్య యాదవ్, వాకిటి మానస, నాగుల పల్లి నరేందర్, పేట ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మత్స్య సహకార సంస్థ చైర్మన్ కాంత్ కుమార్, ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, దామర గిద్ద విండో చైర్మన్ పుట్టి ఈదప్ప, స్థానిక పుర వైస్ చైర్ పర్సన్ మంజుల, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, జిల్లాకు చెందిన సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్ ఫోర్స్‌ల సంయుక్త రైడ్‌లో రూ.1.50 కోట్ల విలువైన 300 కిలోల భారీ గంజాయి పట్టివేత

రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన
4 గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



అశ్వారావుపేట నినాదం మే22 :– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారి, రోహిత్ రాజు శ్రూా ఆదేశాల మేరకు, పాల్వంచ ఇూా సతీష్ కుమార్ సూచనల మేరకు తేదీ 21–05–2026 న మధ్యాహ్నం అశ్వారావుపేట ూా చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా అశ్వారావుపేట పోలీసులు మరియు టాస్క్ ఫోర్స్, భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ జాయింట్ రైడ్ లో నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠాను పట్టుకొని, సుమారు రూ.1.50 కోట్ల విలువైన 300 కిలోల భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు, వాహన తనిఖీలలో భాగంగా పోలీసులు =జీ 06 జణ 9546 నెంబరు గల మారుతి బాలెనో కారు మరియు =J 51 GA 0464 నెంబరు గల టాటా లారీని అశ్వారావుపేట RTO చెక్‌పోస్ట్ వద్ద జీలుగుమిల్లి గ్రామం వైపు నుండి అశ్వారావుపేట గ్రామం వైపుకు వస్తున్న సమయంలో ఆపి తనిఖీ చేశారు. వాహనాలను పరిశీలించగా, బాలెనో కారు డిక్కీలో ఒక్కొక్కటి 10 కిలోల బరువున్న 5 గంజాయి ప్యాకెట్లు మరియు టాటా లారీలో కేబిన్ వెనుక భాగంలో ప్రత్యేకంగా తయారు చేసిన సీక్రెట్ చాంబర్లో ఒక్కొక్కటి 10 కిలోల బరువున్న 25 గంజాయి ప్యాకెట్లు దాచినట్లు గుర్తించారు.బ్రౌన్ కలర్ ప్లాస్టర్ టేపుతో చుట్టబడి ఉన్న మొత్తం 30 ప్యాకెట్లలో 300 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో కింది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు:

1. రాజేష్ పూరి – రాజస్థాన్ రాష్ట్రం (కార్ డ్రైవరు/ ట్రాన్స్ పోర్టర్ )
2. షహజాద్ ఖాన్ – రాజస్థాన్ రాష్ట్రం , (టాటా లారీ డ్రైవర్/ట్రాన్స్ పోర్టర్ )
3. కమలేశ్ శర్మ – రాజస్థాన్ రాష్ట్రం(ట్రాన్స్ పోర్టర్ )
4. రమేష్ చంద్ర బలై – రాజస్థాన్ రాష్ట్రం (ట్రాన్స్ పోర్టర్ )

విచారణలో నిందితులు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ముంచింగిపుట్టు అటవీ ప్రాంతంలో క్రింది వ్యక్తుల వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

5. వంతాల కృష్ణ ఏ విజయ్ కృష్ణ, ASR, AP ( సప్లయర్ )
6. విక్కీ, నివాసం: బాలిమేళా ప్రాంతం, ఒరిస్సా రాష్ట్రం ( సప్లయర్ )

అనంతరం ఆ గంజాయిని రాజస్థాన్ రాష్ట్రానికి తరలించి 7) గోపాల్ భీల్, రాజస్థాన్ రాష్ట్రం (రిసీవర్ ) అను వ్యక్తికి అధిక ధరలకు విక్రయించి అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రవాణా చేస్తున్నట్లు వెల్లడించారు.పోలీసులు ఈ కేసులో క్రింది వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు.టాటా లారీ నెం. =జీ 51 GA 0464 మారుతి బాలెనో కారు నెం. =జీ 06 జణ 9546 నేరానికి ఉపయోగించిన 4 మొబైల్ ఫోన్లు300 కిలోల గంజాయిఈ ఘటనపై చీణూూ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠాలో ఇంకా సంబంధం ఉన్న ఇతర నిందితులను గుర్తించి పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ఈ భారీ గంజాయి రవాణాను అడ్డుకొని కేసును ఛేదించిన అశ్వారావుపేట పోలీస్ సిబ్బంది మరియు టాస్క్ ఫోర్స్ టీం సిబ్బంది సేవలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారి, రోహిత్ రాజు శ్రూా అభినందించారు.



## ఐ.డీ.ఓ.సీ.పెద్దపల్లిలో ఘనంగా
# భాగ్యరెడ్డి వర్మ జయంతి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ
భాగ్యరెడ్డి వర్మ సేవలు సమాజానికి ఆదర్శం
ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి వేడుకలు



**పెద్దపల్లి రూరల్,మే 22 (నినాదం) :** ఐడీఓసీ పెద్దపల్లిలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ,.భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ, దళితోద్ధరణకు,మూఢనమ్మకాల నిర్మూలనకు,సమాజంలో సమానత్వం కోసం భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషి అనితరసాధ్యమైనదని కొనియాడారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మి,ఆ దిశగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు.మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,వివిధ సంఘాల ప్రతినిధులు కలెక్టరేట్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరిలో ఎస్సై పోస్టు ఖాళీ..
# ప్రజలకు పెరుగుతున్న ఇబ్బందులు




**కోదాడ,మే 22(నినాదం):** అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పోస్టు ఖాళీగా ఉండటంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఎస్సై నవీన్ కుమార్ మేళ్లచెరువుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టాల్సిన కొత్త ఎస్సైకి ఇప్పటికీ ఛార్జ్ అప్పగించలేదు. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఫిర్యాదుల స్వీకరణ, పోలీస్ సేవల్లో ఆలస్యం జరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు అధికారుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతగిరితో పాటు కోదాడ రూరల్ సీఐ పోస్టు కూడా కొన్ని నెలలుగా ఖాళీగా ఉండటంతో పోలీస్ పరిపాలనపై ప్రభావం పడుతోందని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతుల సమస్యలు పక్కనపెట్టి
# వ్యక్తిగత దూషణలు సరికాదు

రైతులకు న్యాయం జరిగే వరకు బీ.ఆర్.ఎస్ పోరాటం ఆగదు
ఒక్క దిష్టిబొమ్మ దహనం చేస్తే,ప్రతి గ్రామంలో మీ దిష్టిబొమ్మల దహనం చేస్తాం
పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తాలో ఎమ్మెల్యే విజయ రమణారావు దిష్టిబొమ్మ దహనం
పెద్దపల్లి పట్టణ బీ.ఆర్.ఎస్ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్




**పెద్దపల్లి రూరల్, మే 22 (నినాదం) :** పెద్దపల్లి నియోజక వర్గంలో వరి ప్యాడీ, మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభమై దాదాపు నేల రోజులు పూర్తవుతున్నా ఇప్పటికీ రైతులకు సరైన న్యాయం జరగడం లేదని,పెద్దపల్లి పట్టణ బీ.ఆర్.ఎస్. అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐ.కే.పీ.కేంద్రాలు, పీ.ఏ.సీ.ఎస్, కొనుగోలు కేంద్రాలు,మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గత 30 రోజులుగా పడిగాపులు పడుతున్నారని రాజ్ కుమార్ తెలిపారు.వరి, మొక్కజొన్న కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండగా, మొక్కజొన్న కొనుగోళ్ల పరిస్థితి ఎంత శాతం పూర్తయిందో కూడా స్పష్టత లేని దుస్థితి పెద్దపల్లి నియోజకవర్గంలో నెలకొన్నదన్నారు. తరుగుదల పేరుతో రైతులను నష్టపరచడం,అధిక తూకాలు వేయడం,సరిపడా బార్దాన్ రైతులకు అందించకపోవడం, కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రత్యేకంగా పెద్దపల్లి మార్కెట్ కమిటీ పరిధిలో మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రైతులు వేలిముద్రలు తీసుకునే విషయంలో రైతులు రాత్రింబవళ్లు డి.సి.ఎం.ఎస్,గోదాము వద్ద కాపలా కాస్తున్నారని, ముసలివాళ్లు,మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఉప్పు రాజ్‌కుమార్ తెలిపారు.డీ.సీ.ఎం.ఎస్ గోదాంల వద్ద ఉదయం నుంచే రైతులు క్యూలలో నిలబడాల్సి వస్తోందని, వర్షాలు పడితే పంట పాడవుతుందనే భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి వారికి తరుగులు లేకుండా న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యలపై ఇటీవల పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే,బీ.ఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి మనోహర్ రెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్‌లో రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారని ఉప్పు రాజ్‌కుమార్ గుర్తు చేశారు. అయితే అధికార పార్టీ నాయకులు రైతుల సమస్యలపై స్పందించకుండా వ్యక్తిగత దూషణలకు దిగడం దురదృష్టకర మన్నారు.రైతులకు న్యాయం చేస్తామనే హామీ ఇవ్వకుండా వ్యక్తిగత విమర్శలకే పరిమితమవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని విమర్శించారు.నిన్న దాసరి మనోహర్ రెడ్డి అధికార పార్టీ నాయకుల వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చిన నేపథ్యంలో,కాంగ్రెస్ నాయకులు తిరిగి ఈ రోజు అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని నిరసిస్తూ ఈరోజు పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తా వద్ద పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు దిష్టిబొమ్మను దహనం చేసినట్లు ఉప్పు రాజ్‌కుమార్ తెలిపారు.రైతుల సమస్యలను పక్కనబెట్టి ప్రతీకార రాజకీయాలకు దిగితే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన దాసరి మనోహర్ రెడ్డి పెద్దపల్లి పట్టణం మరియు నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని,పెద్దపల్లిని అభివృద్ధి దిశగా తీసుకెళ్లారని ఉప్పు రాజ్‌కుమార్ పేర్కొన్నారు.నియోజకవర్గంలో 100% మరుగుదొడ్లు,హరితహారం,మౌలిక సతులు,పట్టణాభివృద్ధి,రైతు సంక్షేమం వంటి అనేక కార్యక్రమాల్లో ఆయన చేసిన సేవలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు రైతులకు న్యాయం చేయకుండా దిష్టిబొమ్మల రాజకీయాలు చేస్తే బీ.ఆర్.ఎస్ పార్టీ కూడా తగిన సమాధానం ఇస్తుందని ఈ సందర్భంగా ఉప్పు రాజ్‌కుమార్ హెచ్చరించారు.ఒక మాట అంటే వంద మాటల సమాధానం చెబుతాం.ఒక దిష్టిబొమ్మ కాల్చితే ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాం, అని స్పష్టం చేశారు.తమ ప్రధాన లక్ష్యం ప్రతీకారం కాదని,రైతులకు న్యాయం జరగడమేనని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఒత్తిడులు,బెదిరింపులు ఎదుర్కొన్నామని, భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు పనిచేయవని ఉప్పు రాజ్‌కుమార్ తెలిపారు. బీ.ఆర్.ఎస్ పార్టీ అధినేత కే. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో, దాసరి మనోహర్ రెడ్డి సారథ్యంలో కొనుగోలు కేంద్రాలలో ఉన్న రైతుల దాన్యం,మొక్కజొన్న మొత్తం కొనుగోలులు పూర్తి అయ్యే వరకు, రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీ.ఆర్.ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంచాల శ్రీధర్, వెన్నం రవీందర్,పూదరి చంద్రశేఖర్, రెవెల్లి స్వామి,కేథం కిషోర్,శిరవేణి లవన్ కుమార్,కనుకుర్తి కార్తీక్, ముఖిమ్,ఫహీం,పల్లె మధు,రేండ్ల నాగరాజ్,ఖాదర్,ఆదిల్ ఖాన్,అజార్, మంజూరు,అథార్,కుక్క మనోజ్, చొప్పరి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యాంగ ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జాలు

పేదల పట్టాలు బుట్టదాఖలు
ప్రకృతివనం ఏర్పాటు దొరకని స్థలం



**వికారాబాద్, మే 22(నినాదం):** అభివృద్ధి చెందుతున్న గ్రామాల్లో ప్రభుత్వ భూములు హాట్ కేకులుగా మారుతున్నాయి. కొందరికి అవి బర్త్ డే కేకుల మారుతున్నాయి ఇష్టంగా రుచిచూస్తున్నారు. జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం మైతాబ్ ఖాన్ గూడ ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జాలు చేస్తున్నారు. నిర్మాణాలు చేసి వ్యాపారాలకు అద్దెకు ఇస్తున్నారు. ప్రభుత్వం పేదల కు ఇళ్లపట్టాలు ఇచ్చిన అవి బుట్టదాఖలైయ్యాయి. ఎకరాలకొద్ది భూమి ధనిక వర్గాల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఎకరం భూమి మూడు నుండి నాలుగు కోట్లపై ధర పలుకుతున్న తరుణంలో ఇక్కడ ప్రభుత్వ భూమిపై అందరి చూపు మళ్ళింది. దీంతో ఇష్టారాజ్యాంగా కబ్జాలు చేస్తున్నారు. ఎల్లకొండ రెవెన్యూ పరిధిలో కి వచ్చే మైతాబ్ ఖాన్ గూడ సర్వే నెంబరు 402లో 207,32 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గ్రామం అధిక భాగం కూడా ఈ సర్వే నంబరులో ఉండటం బిటి రోడ్ల ప్రక్కన ఉండటంతో కామర్షియల్ కేంద్రంగా మారింది. అంతేకాకుండా మూడు జిల్లాల సరిహద్దు కూడా కావడంతో నివాసయోగ్యమైన, వ్యాపార పరమైన స్థలంగా మారడంతో ఇక్కడ భూమి విలువలు అమాంతం పెరిగిపోయాయి. గతంలో మాములుగా కబ్జాల్లో ఉన్నా వారు పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని పట్టాలు పొందటం ప్రారంభించి ఎకరాల కొద్ది భూమిని వశం చేసుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. అయితే ప్రభుత్వ భూమిని పేదల ఇళ్ళ కోసం, సాగుకు యోగ్యంగా ఉంటే సాగుకోసం కేటాయించి వారికి జీవనోపాధి కల్పించడం రివాజు. అయితే ఇక్కడ పేదలు తక్కువగా పట్టా భూములు, ఉద్యోగాలు, వ్యాపారాలు ఉన్నా వారు అధికంగా ఉన్నారు. గతంలో అధికారులు ఇళ్ళ పట్టాలు కూడా అందించ్చారు. నేటికి వారికి స్థలాలు చూపించలేకపోయారు. అందుకు ప్రధాన కారణం కబ్జాల్లో బాడా బాబులు ఉండటం అప్పట్లో అధికారులు వారి నుండి భూమిని తీసుకునే సహసం చేయకపోవడంతో ఇళ్ళ పట్టాలు ఇచ్చిన ఫలితం లేకుండా పోయింది. పేదలకు స్థలం కేటాయించిన అక్కడ ఉన్నా పెద్దలు బెదిరించడాలు, కేసులు పెట్టించాడాలు చేయడంతో పేదలకు ఇక్కడ తావు లేకుండా పోయిందని పరిశీలకులు భావిస్తున్నారు. చివరకు గత ప్రభుత్వం పల్లె ప్రగతి వనాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో వందల ఎకరాల ప్రభుత్వం భూమి ఉన్నా ఈ గ్రామంలో సరైన స్థలం లేక కాలువలల్లో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి చేతులు దులుపు కున్నారు. మాజీ సైనికులకు కేటాయించిన భూమిని కూడా ఇవ్వలేని దుస్థితి ఉందని పలువురు అంటున్నారు. భూ స్వాముల కబ్జాల నుండి ప్రభుత్వం భూమిని తీసుకుని అర్హులైన పేదలకు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

శనివారం 23 మే 2026


# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు

**-ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో అభివృద్ధి అవసరాల గుర్తింపు, కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, మే 22 (నినాదం) :**
ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు, అభివృద్ధి అవస రాలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. కరీంనగర్ కలెక్టరేట్ సభాగారంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం తదితరులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల వారీగా అధికారులు పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారని చెప్పారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులను ప్రారంభించామని తెలిపారు. కొత్త ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమాలు, సంక్షేమ అవగాహన సదస్సులు నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, గ్రామ స్థాయి అభివృద్ధి పనులకు తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికలు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. పోలీసు కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలపై విస్తృత అవగాహన కల్పించామని, సుమారు 1,500 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి 500 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, నగరంలోని 66 డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రతను మెరుగుపరిచామని, నగరం లో కొత్తగా కలిసిన పరిసర ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రంగ్రామ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు ప్రత్యేక సహాయవాణి సంఖ్యలు కేటాయించి సర్పంచులకు తెలియజేయాలని సూచించారు. అసం పూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాల జాబితాను సిద్ధం చేసి వాటి పూర్తి పనులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గ్రామ పంచాయతీల ఆదాయ-వ్యయాలను పర్యవేక్షించి సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని సూచించారు.

## బీజేపీ డ్రామాలను ప్రజలు నమ్మరు :
## మాజీ సర్పంచ్ గద్దల రమేష్ తీవ్ర విమర్శలు



**హుస్నాబాద్ మే 22 (నినాదం);-**
బీజేపీ నాయకులు పనికట్టుకొని ప్రెస్ మీట్లు పెడుతూ బిఆర్ఎస్ పార్టీపై బురద చల్లడానికి ప్రయత్నించడం విడ్డూరమని బిఆర్ఎస్ నాయకుడు చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేష్ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడు బండి సాయి భగీరథ్‌ను అడ్డుపెట్టుకొని చేస్తున్న రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారనీ, డ్రామాలతో అతడిని ప్రజల్లో పునీతుడిని చేయడం ఎవరి తరం కాదని ఆయన స్పష్టం చేశారు. విద్యాసంస్థల్లో తోటి విద్యార్థులపై దాడులు చేయడమే కాకుండా, ఒక మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడులకు పాల్పడుతూ, శారీరకంగా, మానసికంగా వేధించిన వ్యక్తిని సమర్థిస్తూ బీజేపీ నాయకులు ప్రెస్ మీట్లు పెట్టడం సిగ్గుచేటన్నారు. తన కుమారుడు తప్పు చేస్తే చట్టపరంగా శిక్ష పడకుండా చూసేందుకు, రాజకీయ బలాన్ని ఉపయోగించి ముందస్తు బెయిల్ కోసం బండి సంజయ్ పాకులాడారని ఆరోపించారు. ఈ కేసును విచారించే న్యాయమూర్తిని మభ్యపెట్టి, బెయిల్ ఇప్పించుకునేందుకు సదరు జడ్జి భర్తకు రాజకీయ పదవి ఇప్పిస్తామంటూ లాబీయింగ్ చేశారని దుయ్యబట్టారు. కొడుకును కాపాడుకునేందుకు కల్పిత గాథలతో పత్రికా ప్రకటనలు ఇస్తూ, కాలయాపన చేస్తూ కేసు నిలబడకుండా చేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలోని కొందరు నాయకులు ఏకమయ్యారని విమర్శించారు. బాధితురాలైన మైనర్ బాలికపైనే తిరిగి కేసులు పెట్టి బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తుంటే, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించిన తర్వాతే పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. బీజేపీ నాయకులు సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికలుగా సదరు బాలిక వ్యక్తిగత ఫోటోలను అసభ్యంగా చిత్రీకరించి పోస్టులు పెడుతూ, తప్పంతా అమ్మాయిదే అనే విధంగా చిత్రీకరించడం దుర్మార్గమన్నారు. ఇన్ని అక్రమాలకు పాల్పడుతూ, తిరిగి బిఆర్ఎస్ పార్టీని తప్పుగా చిత్రీకరించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బండి సంజయ్ అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ గారి ఆధ్వర్యంలో పోరాటానికి, అంబేద్కర్ చౌరస్తాలో యుద్ధం చేయడానికి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని గద్దల రమేష్ స్పష్టం చేశారు.

## యూసీఎఫ్ నిధుల మంజూరుకు సీఎంకు కృతజ్ఞతలు

**-కరీంనగర్ అభివృద్ధికి భారీ ఊతం**

**-మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు**

**-అర్బన్ డీసీసీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్**



**కరీంనగర్, మే22(నినాదం) :**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అర్బన్ డీసీసీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ముగిసిన తర్వాత కూడా కరీంనగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.70 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ వాటాతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా, హడ్కో రుణం కలిపి మొత్తం రూ.630 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వమే భరించేందుకు ముందుకు రావడం నగరాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. కేంద్రం నుంచి నిధుల మంజూరుకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వరాల నరసింగం, పడిశెట్టి వసంత భూమయ్య, సరైన ప్రసాద్, చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, పర్వతం మీసాల మల్లేశం, గంట కళ్యాణి శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పోతిరెడ్డిపల్లిలో తాడిచెట్లు దగ్ధం

**ఉపాధిని కోల్పోయిన గీత కార్మికుడు**



**జమ్మికుంట మే 23 (నినాదం):**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి వ్యవసాయ పొలంలో కొయ్య కాళ్లు అంటూ పెట్టి వెళ్లారు. ఆ మంటలు వ్యాపిస్తూ వృత్తినే దైవంగా జీవనం సాగించే ఉపాధిగా బతికే గీత కార్మికులు చేపూరి శ్రీకాంత్ గౌడ్ తాడి చెట్లు కాలి బూడిద కావడం తో వృత్తినే జీవనోపాధిగా బతికే అతని తాడి చెట్లు కాలిపోవడంతో జీవన ఉపాధి కోల్పోయానని చెట్టును పట్టుకొని విలపించాడు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గౌడ కులస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

## కలెక్టర్‌ను కలిసిన
## మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న

**-రైతుల సమస్యలు, మార్కెట్ యార్డు అభివృద్ధిపై వినతి**



**కరీంనగర్, మే22(నినాదం):**
కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతులకు ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతానికి అదనపు లారీల ఏర్పాటు, గన్ని సంచుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రైతులకు మార్కెట్ యార్డులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆకుల నరసన్న తెలిపారు. రైతులకు అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు లారీలు, గన్ని సంచుల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నట్లు చెప్పారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

## కరీంనగర్ అభివృద్ధికి 840 కోట్ల మంజూరు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర సహకారానికి సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు**



**కరీంనగర్, మే 22(నినాదం) :**
కరీంనగర్ పట్టణ అభివృద్ధికి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద 840 కోట్లు మంజూరుకావడంపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వాటా మినహా మిగిలిన ?630 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తన వాటా మరియు హడ్కో రుణం ద్వారా భరిస్తోందని తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ?70 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. కేంద్ర వాటా నిలిచిపోవడంతో ఆ నిధులను బహుళ అంతస్తుల పార్కింగ్ భవనం నిర్మాణం, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో భారీ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు వినియోగించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు ప్రధానమంత్రి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి లేఖలు రాశారని, వాటి ఫలితంగానే ఈ నిధులు మంజూరయ్యాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైద్యుల అంజన్ కుమార్, కాంతలా జగన్ రెడ్డి, పాడిశేటి భూమయ్య, చాడగొండ బుచ్చిరెడ్డి, గుండటి శ్రీనివాస రెడ్డి, పెద్దిగారి తిరుపతి, బషీర్, సుదర్శన్, హనీఫ్, జిల్కర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నగర అభివృద్ధికి రూ.840 కోట్ల భారీ నిధులు

**-మోడల్ రహదారులు, స్కైవాక్‌లు, వరద నియంత్రణ పనులతో మారనున్న నగర రూపురేఖలు**

**-మేయర్ కొలగాని శ్రీనివాస్ వెల్లడి**



**కరీంనగర్, మే 22(నినాదం):**
కరీంనగర్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్ల భారీ నిధులను మంజూరు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నిధులతో కరీంనగర్ ఆధునిక సౌకర్యాలతో వేగంగా అభివృద్ధి చెందే నగరంగా రూపుదిద్దుకో నుందని తెలిపారు. మోడల్ రహదారులు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు, జంక్షన్ అభివృద్ధి పనుల కోసం రూ.630 కోట్లు కేటాయిం చగా, డ్రెయిన్ల పునరుద్ధరణ మరియు వరద నియంత్రణ పనులకు రూ.130 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ కోసం రూ.80 కోట్లు ఆమోదించబడినట్లు వెల్లడించారు. ప్రారంభంలో యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ పేరు లేకపోయినా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కృషితో ఈ నిధులు సాధ్యమయ్యాయని మేయర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, బండి సంజయ్ కుమార్‌లకు నగర ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర అధికారుల బృందం ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి ప్రాజెక్టుల అవసరాన్ని గుర్తించిందని తెలిపారు. కరీంనగర్‌ను "మోడల్ సిటీ"గా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పారదర్శకంగా, నాణ్యతతో వినియోగిస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని మేయర్ తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరి సహకారం అవసరమని కోరారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో వరి కొనుగోళ్లలో తీవ్ర అవస్థలు

**- రైతులను వెంటనే ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి**

**-మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్**



**కరీంనగర్, మే22(నినాదం):** కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 40 శాతం వరి ధాన్యమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన నేడు చిత్ర మిశ్రాను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తూకాల్లో మోసాలు, తరుగు పేరుతో క్వింటాకు 10 కిలోల వరకు కోతలు విధిస్తున్నారని విమర్శించారు. గతంలో 'ఏ' గ్రేడ్‌గా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇప్పుడు 'బీ' గ్రేడ్‌గా చూపిస్తూ క్వింటాకు రూ.20 వరకు తగ్గిస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, హమాలీల కొరతతో పాటు గత 45 రోజులుగా లారీల సమస్య తీవ్రంగా ఉందన్నారు. లారీ యజమానులు ప్రతి బస్తాపై అదనపు వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యపు సంచులకు చెదలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు 60 శాతం ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోగా, వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. మట్టి తరలింపుకు వినియోగిస్తున్న లారీలను వెంటనే ధాన్యం రవాణాకు మళ్లించి, యుద్ధప్రాతిపదికన ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగణన-2027పై విస్తృత స్థాయిలో అవగాహన



**దుబ్బాక మే 22 నినాదం:** పట్టణంలో భారత జనగణన-2027 ప్రక్రియపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు శుక్రవారం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం అంగడి బజార్ ప్రాంతంలో ఆటపాటలు, జానపద ప్రదర్శనల ద్వారా ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించింది. ఈ కార్యక్రమానికి హాజరైన పుర కమిషనర్ కే. రమేష్ కుమార్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, జనాభా ఆధారిత ప్రభుత్వ విధానాల రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పారదర్శకంగా, ఖచ్చితమైన వివరాలతో జనగణన ప్రక్రియ విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ పూర్తి వివరాలను సరైన విధంగా నమోదు చేయించుకోవాలని, ఇంటింటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సహకరించాలని ఆయన కోరారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం దేశ ప్రగతికి, భవిష్యత్ అభివృద్ధి కార్యాచరణకు బలమైన ఆధారంగా నిలుస్తుందని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృంద సభ్యులు, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన పొందింది.

## రాష్ట్రంలోనే అత్యధిక
## ఉష్ణోగ్రత మునగాలలో నమోదు



**కోదాడ, మే 22(నినాదం):**
తెలంగాణ రాష్ట్రంలో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతల్లో సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రం 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతతో రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదై రికార్డు సృష్టించింది. ఉదయం నుంచే మండుతున్న ఎండలు, వడగాల్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్న వేళల్లో రహదారులు నిర్మానుష్యంగా మారగా, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావడం తగ్గించారు. రానున్న రోజుల్లో కూడా ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ఉపాధి కూలీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తగినంత నీరు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకుంటూ వడదెబ్బ నుంచి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## శాంతి భద్రతలకు
## విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

**-ఎస్సై ప్రవీణ్ కుమార్**



**హుజూర్ నగర్ (మఠంపల్లి) మే 22 (నినాదం) :**
మఠంపల్లి మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన అంగోతు గోపి ఎన్ సిఎల్ ఫ్యాక్టరీలో ప్రయివేట్ జాబ్ చేస్తున్నాడు, అతను ఆ గ్రామంలో రెండు వర్గాలను రెచ్చగొట్టే విధంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ లు పెట్టినందుకు శుక్రవారం తాహశీల్దార్ ముందు 1 సంవత్సరం, 5 లక్షల స్వంత పూచికత్ పైన బైశీడోవర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై బి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎవరు అయినా అనవసరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు.

## సుదర్శన సహిత
## లక్ష్మీనరసింహస్వామి యాగం



**మిర్యాలగూడ మే 22 (నినాదం):**
శ్రీ వెంకటేశ వైభవం వారి ఆధ్వర్యంలో అష్టోత్తర శత కుండాత్మక శ్రీ సుదర్శన సహిత లక్ష్మీనరసింహ మహాయాగంలో శుక్రవారం ఎన్ఎస్పి క్యాంప్ మైదానంలో మూడవరోజు యథావిధిగా యాగశాలలో మూలమంత్ర, పరివార దేవత హోమ కార్యక్రమాలను శ్రీమాన్ కొండపాక వెంకటాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. తదుపరి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి సుదర్శన స్వామివారికి నీరాటోత్సవం శతఘటభిషేకం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రుత్వికులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు సాయంత్రం ఐదు గంటలకి సాంస్కృతిక కార్యక్రమాలు గంగాహారతితో ఈరోజు కార్యక్రమాలు ముగియనున్నాయి.

## వడదెబ్బకు మృతి చెందిన వ్యక్తికి అంత్యక్రియలు

**ఖమ్మం, మే 22(నినాదం ):.**
ఖమ్మం నగరంలోని మూడవ పట్టణ పోలీస్ పరిధిలోని కాలవడ్డు సతీష్ 55 సంవత్సరాల చేకూరి నాగయ్య ఎండ దెబ్బకు మృతి చెందినాడు త్రీ టౌన్ పోలీస్ వారీ సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ ఘటనా స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా అప్పటికే త్రీ టౌన్ పోలీస్ ద్వారా కుటుంబ సభ్యులు మృతదేహం వద్దకు చేరుకొని మృతదేహాన్ని గుర్తుపట్టినారు కానీ మృతుడికి ఇల్లు లేకపోవడం వలన కిరాయి ఇంట్లో ఉండటం వలన అమృతదేహాన్ని దహన సంస్కారం చేసుకొని ఆర్థిక స్థోమత లేకపోవడం వలన మృతదేహాన్ని కుటుంబ సభ్యుల సమక్షంలో అన్నం ఫౌండేషన్ అమృతదేహానికి పూలదండలతో దహన సంస్కారం చేశారు.

శనివారం । తెలంగాణ
23 మే 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం



ఉపాధి హామీ కూలీలకు రెండు సార్లు పోటో విధానం రద్దు చెయ్యాలి

వికారాబాద్, మే 22(నినాదం ):
ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన పెండింగ్ లో ఉన్న 14 వారాల డబ్బులు వెంటనే ప్రభుత్వం విడుదల చెయ్యాలని, కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని సీ పీ ఎం జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ అన్నారు. శుక్రవారం సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం కోట్ పల్లి మండలం కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క ఉపాధి హామీ కూలీలకు రెండు సార్లు పోటో దిగడం రద్దు చెయ్యాలని ప్రభుత్వాని కోరారు. అదేవిధంగా కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. పెండింగ్ కూలీ డబ్బులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. కూలీలకు పని ప్రదేశంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని పనిప్రదేశంలో అధిక ఎండలకు ఇబ్బందులు పడుతున్నారని టెంట్ సౌకర్యం, మెడికల్ కిట్లు ఏర్పాటు చెయ్యాలని అన్నారు. రోజు కూలి రూపాయలు 307నుండి 600లకు పెంచాలని అన్నారు. పనిదినాలు 200రోజులు కల్పించాలని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్నవారికి రెండు సార్లు ఫోటో తీసే పద్ధతితో కండ్లు, పేస్ పోటోలు రావడం సిగ్నల్ రావడం లేదని, రోజు నాలుగు గంటలు ఫోటోల కోసం సమయం వృథా అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఫోటో విధానం బీజేపీ ప్రభుత్వం వెంటనే రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ సుదర్శన్ సతీష్ నవీన్ నర్సింలు దాశరథి రాజు లాలయ్య అక్బర్ లక్ష్మయ్య దితరులు పాల్గొన్నారు.




## టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూటీఎస్ పోరాటాలు

**- పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి**

**-ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గన్నోజు ప్రసాద్, కొరవి సుధాకరాచారి**

**తొర్రూరు, మే 22 (నినాదం న్యూస్):**
టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ టీఎస్ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఆ సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గన్నోజు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొరవి సుధాకరాచారిలు తెలిపారు. శుక్రవారం తొర్రూరు హైస్కూల్లో ఎస్టీయూ టీఎస్ మహబూబాబాద్ జిల్లా రెండవ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ రెండు కు పి నివేదిక తెప్పించుకొని మెరుగైన పిఆర్సి అమలు చేయాలని కోరారు. వెంటనే ఉద్యోగులకు మెరుగైన పిఆర్సిని అమలు చేయాలని కోరారు. పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని, ఉద్యోగులకు లబ్ధి చేకూరేలా ఈహెచ్ఎస్ ను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, ఎస్ఎస్ఏ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని, మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. 2020 పిఆర్సి లో ఉపాధ్యాయులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను వెంటనే చెల్లించాలన్నారు. సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం అయ్యేవరకు ఎస్టియు పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, చంద్రప్రకాష్,గుంటుక శ్రీనివాస్, యాకయ్య, సిహెచ్ రమేష్, బి సంపత్ కుమార్, ఏకాంబరాచారి, సంపత్, హరికృష్ణ చారి, కుమార్, డాక్టర్ ధారావత్ సంతోష్, ఎస్టీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.



## పథకాల అమల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం

**శాసనమండలి ఛైర్మన్ గుత్తా సికిందర్ రెడ్డి**

**నల్గొండ ప్రతినిధి మే 22 (నినాదం)**
ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా గురువారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని బైపాస్ వద్ద ఉన్న ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ముఖ్యంగా రైతులకు రైతు బీమా, రైతు భరోసా అలాగే 6 గ్యారంటీల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నది చెప్పారు. అయినప్పటికీ వివిధ రంగాలలో ఇంకా నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు పంటల మార్పిడికి వెళ్లాలని, దేశ,కాల , వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. రోజురోజుకు తగ్గిపోతున్న పశు సంపదను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు ఉత్పన్నం అయ్యేందుకు మనమే కారణం కావద్దని, సమస్యల పరిష్కారం పై లోతుగా ఆలోచించాలన్నారు. విద్య, సాగునీరు ,వైద్య రంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు, మోడల్ పాఠశాలలు ఏర్పాటు, విద్యార్థులకు యూనిఫామ్స్ ,మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నదని, అంతేకాక రానున్న విద్యా సంవత్సరం నుండి అల్పాహారం కూడా అందించనుందని తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని ,ఈ విషయంపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యం కోసం ట్రాక్టర్లు ఏర్పాటు చేశామని, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ చేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తున్నామని, జూన్ 2 నాటికి జిల్లాలో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ఇంకా పలు కార్యక్రమాలు. చేయాల్సి ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక ద్వారా అనేక కార్యక్రమాలను ప్రజల దగ్గరికి తీసుకు వెళ్ళినట్టు చెప్పారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక ప్రజల కార్యక్రమాలతో అంకితమైన కార్యక్రమం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను, త్వరలో అమలు చేయనున్న కొత్త పథకం కుటుంబ జీవిత బీమా పథకాన్ని వివరించారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ ఇంకా సమస్యలు ఉన్నాయని, వాటిపై కూడా దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చి 6న ప్రారంభమైన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలను, సాధించిన విజయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ కార్యక్రమం తో పాటు, అలైవ్ ,అరైవ్ , రోడ్డు భద్రత పై తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వడ్లు, మక్కల కొనుగోలు చేపట్టాలని

# తహశీల్దార్ కు వినతి



**తొర్రూరు, మే 22 (నినాదం న్యూస్):**
భారతీయ జనతాపార్టీ (బీజేపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తొర్రూరు లో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ మరియు తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షులు గట్టు రాంబాబుల ఆధ్వర్యంలో పంటల కొనుగోలు లో రైతులు పడుతున్న ఇబ్బందులపై తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, పంటలు కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రెండు నెలలు కాలం పూర్తయినా కూడా కొనుగోలు చేయకపోవడం దారుణం అని, కొనుగోలు కేంద్రాల్లో తీవ్రంగా జాప్యం జరుగుతోంది అని,గన్నీసంచుల కొరత,హమాలీ కొరత కారణంగా కాంటాలు వేయడం లేదని,కాంటాలు వేస్తే వాటిని తరలించడానికి లారీలు, ట్రాక్టర్ల కొరత ఉందని,తీరా మిల్లులకు తరలిస్తే వారు తాలు,తరుగు,తేమ పేరుతో ఐదు నుంచి పది కేజీల వరకు తీసేస్తూ రైతుల కష్టాలను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.మక్కల కొనుగోలు కేంద్రాల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, చేతులు తడిపిన వారి మక్కలను కాంటాలు వేస్తూ డబ్బులు ఇవ్వని వారిని పక్కన పెడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అని,ఈ సీజన్లో మొక్కజొన్న అధికంగా పంట సాగు చేశారని వ్యవసాయ అధికారులు మక్కల కొనుగోలు పై సరైన అవగాహన , ప్రణాళిక లేకపోవడం వల్ల ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం ,లారీలు ట్రాక్టర్ల ను అందుబాటులో ఉంచకపోవడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది అని ,రైతులు తీవ్ర ఎండలతో కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతుంటే సిఎం రేవంత్ రెడ్డి,మంత్రి వర్గానికి ఎలాంటి చలనం లేదు అని రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే కొనుగోలు కేంద్రాల్లో జాప్యాన్ని నివారించి యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ కొలుపుల శంకర్, జిల్లా నాయకులు అమ్మాపురం గ్రామ ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, మంగళపల్లి యాకయ్య, మండల ప్రధాన కార్యదర్శులు నడిగడ్డ సందీప్, గుగులోత్ భాస్కర్ నాయక్, గంధం రాజు, నూకల నవీన్, గుండా సురేష్, కొండపల్లి శ్రీనువాస్,తాడిశెట్టి నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ బహిష్కరణ చేసిన వారిపై

# చర్యలు తీసుకోవాలి

- ఇంకా ఏ కాలంలో బతుకుతున్నాం
- బీసీ, ఎస్సీ, ఎస్టీలు అంటే అంత చులకన భావన ఎందుకు?
- బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**పెద్దమందడి, మే 22 (నినాదం)**
గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దమందడి మండలంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో మండల కేంద్రం చేయాలనే తలంపుతో జంట గ్రామాలైన బలిజపల్లి, జంగమయ్యపల్లి ని గుర్తించడం జరిగిందన్నారు. అందుకోసం ఎమ్మెల్యే మేఘారెడ్డి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి లెటర్ రాయడంతో కలెక్టర్ తదుపరి చర్యలను ముందుకు తీసుకోవడం జరిగిందన్నారు. కానీ అప్పట్లోనే కొందరు తమ గ్రామాలను మండల కేంద్రంగా చేయవద్దని కొన్ని రోజులు ధర్నాలు జరపగా..వారికి ఎలాంటి ఆంక్షలు విధించకుండా ప్రశాంతంగా ధర్నాలు చేసుకునేలా పోలీసులు, అధికారులు అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమస్య అక్కడితో సమసి పోగా ఇటీవల జంట గ్రామాల్లో జరగబోయే బొడ్రాయి పండుగకు కొందరు గ్రామ ఆధిపత్య వ్యక్తులు మండల కేంద్రాన్ని చేయాలని తపించిన 9 మందిని గ్రామ బహిష్కరణ చేస్తూ దూరం పెట్టడం జరిగిందన్నారు. బొడ్రాయి పండుగ అవసరాల కోసం గ్రామస్తులు డబ్బు పోగుచేసుకునే క్రమంలో ఈ తొమ్మిది మంది వ్యక్తులతో డబ్బులు తీసుకోవద్దని వారిని బహిష్కరిస్తున్నట్లు చెప్పి వారిలో నుంచి అగ్రవర్ణాలకు చెందిన ఒక వ్యక్తితో మాత్రం చందాలు తీసుకోవడం కుల దురహం కారానికి నిదర్శనం అన్నారు. స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్నా నేటికి కుల వివక్ష పోవడం లేదని, అంతేకాకుండా తొమ్మిది మందిపై దాడి చేసే కుట్ర జరగడం అవివేకమన్నారు. 9 మందిలో ఒకరైన రమేష్ గౌడ్ గతంలో రెండు పర్యాయాలు సర్పంచిగా, ఒకసారి జెడ్పీటిసి సభ్యునిగా పని చేశారని, అలాంటి వ్యక్తి గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలనుకోవడం తప్పా? అని ప్రశ్నించారు. మండల కేంద్ర ఆమోదం కోసం లెటర్ రాసిన ఎమ్మెల్యే, గ్రామస్తులు బాగానే ఉన్నారు. కానీ మండల కేంద్రం చేయాలని తపించిన 9 మందిని ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ఈ సమస్యపై ధర్నా చేస్తున్న వారిపై ఎందుకింత వివక్ష అని, అధికార పార్టీకి చెందిన నాయకులకే ఇంతటి ఇబ్బంది కలిగితే సామాన్యుల పరిస్థితి ఏంటో ఒకసారి ప్రజలు గుర్తించాలన్నారు. తప్పులు చేసిన వారు బాగానే ఉంటున్నారు కానీ తప్పును తప్పుగా చూపిన వ్యక్తులను అరెస్టు చేసి స్టేషన్ కు తరలించడం అగ్రవర్ణ దురాహంకారానికి నిదర్శనం అన్నారు. ప్రతిపక్ష నాయకులు, మాజీ మంత్రి బంధుగణం ధర్నాలు చేస్తే అనుమతి ఇచ్చే పోలీసులు మరి వీరిపై ఎందుకు ఇంత ఖర్గశంగా వ్యవహరి స్తున్నారని, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. వనపర్తి జిల్లాలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి పూర్తిగా గతి తప్పుతుందని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు కుల వివక్ష పై ఎస్సీ కమిషన్, బీసీ కమిషన్, మానవ హక్కుల సంఘానికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని, అంతటితో ఆగకుండా ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల సంఘానికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి సభ్యుడు రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ చీర్ల విజయ చందర్, బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## అధికారుల నిర్లక్ష్యంతోనే

# ఉపాధి కూలీ గోవిందమ్మ మృతి

- ఏపీవో పంచాయతీ కార్యదర్శి లను సస్పెండ్ చేయలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్



**అమరచింత, మే 22, (నినాదం):**
అధికారుల నిర్లక్ష్యంతోనే ఉపాధి కూలీ గోవిందమ్మ మృతి చెందిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్.అజయ్ ఆరోపించారు. ఈ ఘటనకు కారణమైన ఏపీవో పంచాయతీ కార్యదర్శులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మదనపురం మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన కావలి గోవిందమ్మ శు క్రవారం ఉపాధి పనులకు వెళ్లి బావి నుంచి నీళ్లు తెస్తుశీడగ జారీపడి బావిలో పడి మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పని చేసే ప్రతి ప్రదేశంలో పంచాయతీ కార్యదర్శులు మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలులో కార్యదర్శులు నిర్లక్ష్యం మూలన ఒక ఉపాధి కూలి మృతి చెందిందని వాపోయారు. దీనికి కారణమైన ఈజీఎస్ ఏపిఓ బాలయ్య. అజ్జకొల్లు పంచాయతీ కార్యదర్శి ఇశ్రత్ బేగం లను విధుల నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించి ఫలితంగా ఉపాధి పని ప్రదేశంలో మంచినీటి వసతి ఏర్పాటు బాధిత కార్యదర్శిలదేనని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సితక్క ఆదేశాలు ఇచ్చినప్పటి అధికారులు వీటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం మూలంగా ఈరోజు ఉపాధి కూలీ మృతి చెందిందని ఆమె మృతికి అధికారులదే బాధ్యతఅని అన్నారు. మృతురాలి



కుటుంబానికి 5లక్షల నష్టపరిహారంతో పాటు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దహన సంస్కారాలకు రెండు లక్షల నగదును తక్షణమే అందించాలనిడిమాండ్ చేశారు . ఇటీవల కాలంలో ఉపాధి కూలి పాలెం లో మృతి చెందిన ఘటన మరువకముందేజిల్లాలో మరో కూలి మృతి చెందినఘటన జరగటం విచారకరంమని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇద్దరు ఉపాధి కూలీలు మృతి చెందినప్పటికీ పనుల ప్రదేశంలో మంచినీటి వసతి ఏర్పాటు చేయడంలో మాత్రం అధికారులు అలసత్వం వహిస్తూనే ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. పని చేసే ప్రతి ప్రదేశంలో కొంతమంది కూలీలను నీళ్లు తేవడానికి కేటాయించడం వల్ల ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత.ఎమ్ పి డి వో లు.పంచాయతీ కార్యదర్శులేనని మరోసారి తెలియజేశారు. ఇప్పటికైనా ఇటువంటి ఘటన జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మ్యాథరి వెంకట్ రాములు. టి యస్ వ్యకస మదనపురం మండల అధ్యక్షకార్యదర్శులు చీర్ల ప్రసాదు మండల సత్యానారాయణ. మణి వర్ధన్ మాసన్న. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## వడదెబ్బతో ఇద్దరి మృతి

**కాటారం, మే 22(నినాదం ):**
మండలంలోని మేడిపల్లి, శంకరాంపల్లి గ్రామాల్లో వడదెబ్బుతో ఇద్దరు మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి గ్రామానికి చెందిన జెల్ల లస్మయ్య (60), శంకరాంపల్లి గ్రామానికి చెందిన గాదె సమ్మక్క (65) ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఇద్దరూ మృతి చెందినట్లు తెలిపారు. వృద్ధుల మృతితో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## తాటి చెట్లు దగ్ధం

**కమలాపూర్,మే 22 (నినాదం)**
మండల కేంద్రంలో పంట కోసిన వరి పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం వరి కొయ్యలు తగలబెట్టడంతో మంటలు చెల రేగి ఎక్కువగా వీస్తున్న గాలులకు క్రమంగా తాటి వనం వరకు వ్యాపించాయి. దింతో తాటి వనం దగ్ధం అయ్యింది.ఈ మంటల్లో సుమారు 150 వరకు కల్లు పారే తాటి చెట్లు మంటల్లో దగ్ధం అయ్యాయని గీతా కార్మికులు తెలిపారు.కల్లు గీత వృత్తి మీద ఆధార పడిన గౌడ కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లిందని గీతా కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.మర్రిపల్లి గూడెం గ్రామంలో వరి కొయ్యలు తగల పెట్టడంతో కరంటు పైపులు, మామిడి చెట్లు దగ్ధం అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గునిపర్తి గ్రామంలో సైతం వరి కొయ్యలు తగల పెట్టడంతో మంటలకు తాటి చెట్లు దగ్ధం అయ్యాయని గీతా కార్మికులు తెలిపారు.



## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

**మహాదేవపూర్ మే 22, (నినాదం):**
దళిత వైతాళికుడు ఆది హిందూ ఉద్యమ స్థాపకుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ 138 వ జయంతి ని మహదే వపూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ని ఎస్సీ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్ర పై ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హసీనా బాను, ఉప సర్పంచ్ శ్రీజ, అంబేద్కర్ సంఘం నాయ కులు మెరుగు లక్ష్మణ్, తో పాటు పలువురు పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్ కు సన్మానం

**మహాదేవపూర్ మే 22, (నినాదం)**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షురాలిగా ఎన్నికైన మహాదేవపూర్ ఉపసర్పంచ్ తుంగల శ్రీజ ను స్థానిక సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో పాలకవర్గం ఘనంగా సన్మానించింది. గ్రామ పంచాయ తీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మొగిలి, నయూమ్, స్వామి, సమ్మయ్య, చంద్రశేఖర్, అస్రార్, రాములు తో పాటు పలువురు పాల్గొన్నారు.



## చలివేంద్రం ప్రారంభం

**మహాదేవపూర్ మే 22, (నినాదం):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని పవిత్ర పుణ్యక్షేత్ర మైన కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు దాహార్తిని తీర్చేందుకు మహాదేవపూర్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలి వేంద్రాలను స్థానిక సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రతకు భక్తులు త్రాగునీటికి ఇక్కట్లు పడకుండా కళాశాల వద్ద, బస్టాండ్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుంగల శ్రీజ, వార్డు మెంబర్ లు చంద్రశేఖర్, గడ్డం స్వామి, అస్రార్, మొహమ్మద్, రాములు, సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి కల్పన, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కడార్ల నాగరాజు తో పాటు పలువురు పాల్గొన్నారు.

శనివారం । తెలంగాణ
23 మే 2026

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం



## విఓఏల సమస్యలు పరిష్కరించాలి

### ఎంపిడిఓకు వినతిపత్రం అందజేత

**కొడంగల్, మే,22(నినాదం)**

విఓఏ ల సమస్యలు పరిష్కరించాలని బొంరాస్ పేట్ మండల అభివృద్ధి అధికారి వెంకన్న గౌడ్ కు శుక్రవారం విఓఏ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేఖలో ప్రభుత్వాన్ని కోరినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాథోడ్ సూర్య నాయక్, కార్యదర్శి రూప్లానాయక్, కోషాధికారి సురేందర్ రెడ్డి, బసప్ప, కృష్ణ, మల్కప్ప, చరిత, దేవమ్మ, అనిత, రూప, నీలిబాయి, అమృతమ్మ, లాలప్ప, శైలజ తదితరులు పాల్గొన్నారు.



## కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద నల్లబెల్లం పట్టివేత!

**ఆమనగల్లు, మే 22(నినాదం)**

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద అబ్కారీ శాఖ అధికారులు జరిపిన సోదాల్లో 150 కేజీల నల్లబెల్లం, 15 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి గ్రామాలకు సారా తయారీ కోసం వీటిని తరలిస్తుండగా పట్టుకున్నారు. సాలార్ పూర్ గ్రామానికి చెందిన నేనవత్ కోట్య, నేనవత్ నరేష్‌లపై కేసు నమోదు చేసి, ఆటో, బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ బద్యానాథ్ తెలిపారు.



## అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలపై కఠిన చర్యలు

**కుత్బుల్లాపూర్, మే 22 (నినాదం)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ డిపోచంపల్లి గ్రామంలోని సర్వే నెం.168 నందు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న 3 నిర్మాణాలను అధికారులు జెసిపిల సహాయంతో కూల్చి వేశారు. గాగిలాపూర్ గ్రామంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను సహితం టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## కొనుగోలు జాప్యంపై బీజేపీ ఆగ్రహం

### రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్వోకు వినతి

**భీమదేవరపల్లి మే 22 (నినాదం):**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై భారతీయ జనతా పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు ఎన్నో కష్టాలు పడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం త్వరితగతిన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు సమయంలో తరుగు, తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా పారదర్శకంగా కొనుగోలు చేయాలని కోరారు. మండలంలోని అన్ని ఐకేపీ కేంద్రాల్లో సరిపడా లారీలను



ఏర్పాటు చేసి ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు నెలలు గడిచినా ఇప్పటివరకు డబ్బులు వారి ఖాతాల్లో జమ కాలేదని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ చెల్లింపులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, భీమదేవరపల్లి మరియు కొత్తకొండ సర్పంచులు మాచర్ల కుమారస్వామి, సిద్ధమల్ల రమా రమేష్, జిల్లా నాయకులు దొంగల వేణు, గుండెల్ని సదానందం, పోడేటి బిక్షపతి, ముద్దసాని వీరన్న, బొల్లంపల్లి శ్యామ్, గద్ద రాజేందర్, బొజ్జపురి పృథ్వీరాజ్, అయిత సాయి తేజ, పయ్యావుల రాజు, బోడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరవధిక సమ్మెకు దిగిన వివోఏలు

**దమ్మపేట, మే 22(నినాదం):**

తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ఐకెపి వివోఏ లా పిలుపుమేరకు దమ్మపేట మండల ప్రజాపరిష్యత్ కార్యాలయం ఎదుట మండలంలో వివోఏ పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ తీర్చాలని కోరుతూ గురువారం నిరవదిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వివోఏల మండల సంఘ నాయకురాలు కడిమి ధనలక్ష్మి మాట్లాడుతూ చాలిచాలని జీతాలతో కుటుంబపోషణ కష్టంగా మారిందని ప్రభుత్వం తక్షణమే స్పందించి వివోఏ ల కనీస వేతనం 26000/- ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలానే తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ ఆర్ పాలసీ వర్తింపజేయాలని, అర్హులైన వివోఏలకు పదోన్నతి కల్పించాలని కోరారు. వివోఏ లు పనిచేస్తున్న అందరికి సాధారణ మరియు ఆరోగ్యభీమ 20లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం



తెచ్చిన 58జి.ఓ ను సవరించి పనిభారం తగ్గించాలన్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు తమ డిమాండ్లు నెరవేర్చాలని అర్జీలు పెట్టుకున్న వినతిపత్రాలు అందించిన అధికారుల నుండి కనీస స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ చివరి ప్రయత్నంగా సమ్మెబాట పట్టినట్టు తెలుపుతూ తమ న్యాయమైన డిమాండ్లను తీర్చేవరకు సమ్మెవిరమించేది లేదని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీ.బద్రమ్మ, యం. వెంకటమ్మ, యన్. శ్రీలత, బి.భవానీ, కే.కమల ,మంగ,సీత,చెన్నమ్మ ,శ్రీలత, శ్రీదేవీ తదితరులు పాల్గొన్నారు.

## మా మంచినీటి కష్టాలు ఎవరితో చెప్పుకోవాలి

**వెల్దుర్తి మే 22 (నినాదం):**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోనూ బిందెడు నీళ్లే దిక్కు ఒక బిందెతో స్నానాలు, బట్టలు ఎలా? అంటూ మహిళల ఆవేదనతో వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లా, వెల్దుర్తి మండల కేంద్రంలో నీటి ఎద్దడి తారాస్థాయికి చేరింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలు సైతం గుక్కెడు నీటి కోసం గోస పడుతున్నాయి. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంట డంతో పక్కనే ఉన్న హల్దీ వాగు సైతం ఎడారిని తలపిస్తోంది. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఏర్పాటు చేసిన నల్లాలు చుక్క నీరు కూడా రాక మూగ బోయాయి.సమస్యను లబ్ధిదారులు పంచాయతీ ఈవో దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ట్యాంకర్ పంపించారు. అయితే వచ్చిన నీళ్లు ఇంటికి ఒకటి రెండు బిందెల చొప్పున మాత్రమే పంచడంతో కుటుంబాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇచ్చి మా కల నెరవేర్చారు. కానీ తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వలేక పోతున్నారు. ఒక్క బిందె నీళ్లు తాగడానికి, వంటకు




సరిపోతాయి. మరి స్నానాలు, బట్టలు పిండుకోవడానికి ఎక్కడికి పోవాలి? పిల్లలను స్నానాలకు అదే విధంగా బట్టలతో ఉతకాలి. రోజుల తరబడి మురికి బట్టలతోనే కాలం వెళ్లదీస్తున్నాం" అంటూమహిళలుకన్నీటి పర్యంత మయ్యారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో వెంటనే బోరు వేయించి నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని బాధితులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. "ఇల్లు కట్టించి ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదు. నీళ్ల సౌకర్యం లేకపోతే మేము ఎలా బతకాలి? ప్రస్తుతం ట్యాంకర్ నీళ్ల కోసం ఎండలో గంటల తరబడి క్యూ కడుతున్నాం. వృద్ధుల పరిస్థితి మరీ దారుణం" అని కాలనీ వాసులు మండిపడ్డారు. మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నా చుక్క నీరు రావడం లేదని, అధికారులు వెంటనే స్పందించి రోజుకు కనీసం రెండు మూడు ట్యాంకర్లు పంపించి తాత్కాలిక ఉపశమనం కలిగించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని గ్రామస్తులు తీవ్ర స్థాయిలో హెచ్చరిస్తున్నారు.

## మహిళా సాధికారికతకు ప్రభుత్వం అండ

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి, మే 22 (నినాదం):**

సంక్షేమం, అభివృద్ధి, మహిళా సాధికారికత, సామాజిక భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన బాసటగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కంది సమీపంలోని ఎల్.ఎన్. కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కుటుంబ సంక్షేమానికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అవసరమని, ప్రతి ఒక్కరు ఆత్మగౌరవంతో జీవించేలా నైపుణ్య ఆధారిత విద్యను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గత ఏడాది వెయ్యి ప్రీ-ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయగా, అందులో జిల్లాలోనే సుమారు 130 పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా ఒక్కోటి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలను నిర్మిస్తున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధిగా జీవించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఇందిర శక్తి మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, నైపుణ్య శిక్షణ



ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు 163 కొత్త చికిత్సలను చేర్చినట్లు మంత్రి తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 90 శాతం వైద్య సేవలు జిల్లాలోనే అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేర్ సెంటర్, ప్రతి 25 కిలోమీటర్లకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 9 వేల నర్సింగ్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు 16 నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేశామని, మొత్తం 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. సిబ్బంది, మందుల కొరతపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సనత్‌నగర్‌లో వెయ్యి పడకల టిమ్స్ ఆసుపత్రిని జూన్ నెలలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ఆరు గ్యారంటీలను ప్రజలకు సమర్థవంతంగా అందిస్తోందన్నారు. చెప్పింది చేసి చూపించే ప్రభుత్వంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో పారదర్శక పాలన అందించే దిశగా కృషి చేస్తోందన్నారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కులను మంత్రి, టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ పంపిణీ చేశారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను మంత్రి అందజేశారు. కార్యక్రమానికి ముందు మంత్రి, టి జి ఐ ఐ సి చైర్‌పర్సన్ వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రదర్శించిన ఆయిల్ ఫామ్ మొక్కలు, డ్రోన్ సాంకేతికత తదితరాలను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లపై డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సి.డి.సి చైర్మన్ రామ్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ. ఫహీమ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**ఇల్లందు మే 22 (నినాదం):**

మండలం పరిధిలోని తిలక్ నగర్ గ్రామపంచాయతీలో అర్హులైన పేదలకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరడంతో ఇళ్లను ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం పరిశీలించారు.త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని. లబ్ధిధారులకు సూచించారు . తమకు విద్యుత్ కనెక్షన్ లేదని ఎమ్మెల్యేకి దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే నిర్మాణంలో ఉన్న ఇళ్లకు విధ్యుత్ సౌకర్యం కల్పించాలని, విధ్యుత్ అధికారులను ఆదేశించారు. అనంతరం కల్తిరామయ్య గుంపులో పర్యటించగా అక్కడ తునికాకు సేకరించి కట్టలు కడుతున్న మహిళల వద్దకు వెళ్లి వారితో కూర్చొని తునికాకు కట్టలను ఎమ్మెల్యే కట్టుతూ, తాను పేద కుటుంబం నుండే వచ్చేనని పేదవారు అంటే ఎంతో మక్కువ అని ఎమ్మెల్యే కంటే పేదవాడిగా ఉండటమే గర్వకారణం అన్నారు వారితో ముచ్చటిస్తూ తునికాకు సేకరణ సమయంలో బట్టలు కట్టి కల్లాలకు షేర్ చేసే సమయంలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలు వారి వెంట ఇల్లందు మండల పార్టీ అధ్యక్షులు మండల రాంమహేష్,స్థానిక సర్పంచ్ ధనసరి స్రవంతి రాజు, విజయలక్ష్మి నగర్ ఉప సర్పంచ్ గుడేల్లి రేణుక ఉపేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎట్టి హరిక్రిష్ణ, ఇల్లందు పురపాలకం కొ ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి,నాయకులు పూనెం సురేందర్, తాటి భిక్షం, వడ్ల శ్రీను, దండుగుల శివ తదితరులు పాల్గోన్నారు



## సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

**మల్కాజిగిరి, మే 22 (నినాదం)**

మల్కాజిగిరి డివిజన్ కి చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు నగేష్ కు 9 వేలు, మాధవేని శ్రీనివాస్ కు 24 వేలు, సట్ల భిక్షం కు 27 వేలు, వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన చెక్కులను శుక్రవారం బోయిన్పల్లి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ తో కలిసి లాబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ లక్షలు వ్యయం చేయలేక అవస్థలు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆసరాగా నిలుస్తుందని అన్నారు. నిరుపేదల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారి సంక్షేమానికి పాటుపడుతున్న ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి కి లాబ్దిదారుల కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జేపీసీ వెంకన్న, సుధాకర్, చోటు, శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్‌ను ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహం

### రాష్ట్రఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో, మే 22 (నినాదం):**

జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ సౌజన్యంతో ప్రత్యేక ఆయిల్ పామ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన వివరాలను జిల్లా ఉద్యాన అధికారి పి.సోమేశ్వరరావు మంత్రికి వివరించారు. రైతులకు స్థిరమైన, అధిక ఆదాయాన్ని అందించే పంటగా ఆయిల్ పామ్‌ను ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని వారు తెలిపారు. రైతాంగాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. అదేవిధంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పంట కొనుగోలు చేయడం జరుగుతుందని, పంటకు సంబంధించిన చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను మరియు రైతాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.



## భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలు

**దుబ్బాక మే 22 (నినాదం)**

దుబ్బాక పట్టణంలోని లచ్చపేట వార్డులో ఆది హిందూ ఉద్యమ నిర్మాత, అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటయోధుడు, మహోన్నత సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన సమాజ సేవలను, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, తిమ్మాపూర్ సర్పంచ్, రాష్ట్ర కన్స్యూమర్ అసోసియేషన్ అధ్యక్షులు కుంభాల రవి, జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత దళిత రత్న ఆసముత్యం, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు సంఘం ప్రభాకర్ ముదిరాజ్ తదితరులు హాజరయ్యారు. అలాగే వివిధ ప్రజా సంఘాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భాగ్యరెడ్డి వర్మ సమాజంలో అణచివేతకు గురైన వర్గాల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని కొనియాడారు. విద్య, స్వాభిమానం, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన ఉద్యమాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల స్థాపనకు కృషి చేసిన తొలి సామాజిక సంస్కర్తల్లో భాగ్యరెడ్డి వర్మ ఒకరని గుర్తుచేశారు. అణగారిన వర్గాల్లో చైతన్యం తీసుకురావడం, మూఢనమ్మకాల నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు అభిప్రాయపడ్డారు. నేటి యువత మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం మొత్తం సామాజిక చైతన్యం, ఆత్మగౌరవ భావాలతో కొనసాగింది. చివరగా "మహనీయుల ఆశయాలు వర్ధిల్లాలి", "సామాజిక న్యాయం సాధించాలి", "జై భీమ్" నినాదాలతో ప్రాంతం మారుమోగింది. కార్యక్రమం గౌరవప్రద వాతావరణంలో ముగిసింది.

శనివారం । తెలంగాణ
23 మే 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం



## పోలో యాప్ పరిచయం.. యువకుడి హత్యకు దారి...
### గణపవరం హత్య కేసులో ముగ్గురు అరెస్ట్.. ఒకరు పరారీ...

**కోదాడ,మే 22(నినాదం):**
కోదాడ మండలం గణపవరం గ్రామ శివారులో సంచలనం రేపిన బలుగురి గణేష్ హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రూరల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.పోలో యాప్ ద్వారా ఏర్పడిన పరిచయం, ఏకాంత సమయంలో తీసుకున్న ఫోటోల విషయంలో నిందితుల మధ్య విభేదాలు తలెత్తినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు బర్రెంకుల సోమేష్ తన స్నేహితుడు పగిల్ల ఉదయ్ కిరణ్ సహాయంతో గణేష్‌ను నిర్మానుష్య ప్రాంతానికి పిలిపించి రాళ్లతో దాడి చేసి, అనంతరం గొంతు బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. కేసులో పగిల్ల ఉదయ్ కిరణ్‌తో పాటు బర్రెంకుల జ్యోతి, బర్రెంకుల సాంబయ్యలను అదుపులోకి తీసుకుని, సంఘటన స్థలం నుంచి కత్తి, మొబైల్ ఫోన్లు తదితర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు బర్రెంకుల సోమేష్ కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. సాంకేతిక ఆధారాలతో కేసును త్వరగా ఛేదించిన పోలీసు బృందాన్ని డీఎస్పీ అభినందించారు. సోషల్ మీడియా పరిచయాల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి, రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి, మేళ్లచెరువు ఎస్సై నవీన్ కుమార్, చింతలపాలెం ఎస్సై పరమేష్ పాల్గొన్నారు.

## సోసైటీ చైర్మన్‌గా తీగ రమణయ్య బాధ్యతలు స్వీకరణ..

**పాలేరు, మే 22( నినాదం)**



స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడుగా తీగ రమణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 8 న డైరెక్టర్ మైశా శంకర్ ను పాలకవర్గం అంతా కలిసి అధ్యక్షుడు గా ఎన్నుకున్నారు. కాగా సోసైటీ లో తాను సీనియర్ సభ్యుడు గా ఉన్నానని రాయగూడెం కు చెందిన సోసైటీ మరో డైరెక్టర్ తీగ రమణయ్య హైకోర్టు ను ఆశ్రయించారు. సోసైటీ బైలా ప్రకారం తనకు అవకాశం కల్పించాలని న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి అధ్యక్షుడుగా తీగ రమణయ్య ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సోసైటీ కార్యాలయం లో భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.సోసైటీ బలోపేతం కు శక్తి వంచన,లేకుండా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. సోసైటీ అధ్యక్షుడు గా బాధ్యతలు స్వీకరించిన రమణయ్య ను వివిధ పార్టీల నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ కార్యదర్శి ఖమ్మం వెంకటేశ్వర్లు ఉన్నారు.



## ప్రతీ ఒక్కరూ మొక్కలు పెంచటం బాధ్యతగా తీసుకోవాలి జిల్లా టూరిజం ఇంచార్జీ అధికారి సునీల్‌రెడ్డి

**పాలేరు మే 22( నినాదం)**
ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని.అది సామాజిక బాధ్యత అని జిల్లా పర్యాటక శాఖ ఇంచార్జీ అధికారి సునీల్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం బౌద్ధక్షేత్రం వద్ద స్వచ్ఛత కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సూచించారు. వ్యక్తిగత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యం కు మించిన ఆస్థి మరొకటి లేదన్నారు. ఆ ఆరోగ్యంను కాపాడుకునేందుకు పర్యావరణం ను సంరక్షించాలన్నారు. పర్యాటక ప్రాంతంను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి. హెచ్:శివ, వివిధ పంచాయతీల సర్పంచ్ లు శీలం వెంకటలక్ష్మి, రాంబాబు, ఆయా పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతీ పేదవాడికి అండగా పీఎస్ఆర్ ట్రస్టు 147 మందికి రూ.10 వేల చొప్పున అందజేత..

**పాలేరు మే 22( నినాదం)**
ప్రతీ పేదవాడి కుటుంబానికి పీఎస్ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన 147 కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్టు నుంచి రూ. 10 వేల చొప్పున శుక్రవారం అందించారు. మృతుల కుటుంబాలను సందర్శించి.కుటుంబ సభ్యులను ఓదార్చి.ట్రస్టు ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రాజకీయాలకు అతీతంగా మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం ను' అందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆర్థిక సహాయం ను అందిస్తాన్నారని అన్నారు. వారికి మంత్రి అండగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, పాకనాటి కన్నారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, తిగుళ్ల భవాని, వడ్లమూడి నర్సయ్య, మందడి నాగశ్రీను, వుల్లోజి ప్రభుదాసు, కర్ల ఆశోక్, కొమ్మినేని విజయ్ బాబు, కొమ్మినేని పుష్పావతి, కర్ల ఏసు, బోయిన కొండలు, అప్పారావు, వడ్లమూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ రహిత సమాజంలోభాగస్వాములు కావాలి..

**చేవెళ్ళ మే 22( నినాదం):**
చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, పాల్గొని యువత ఇంటి పరిసరాలతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి అన్నారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులోని మంగలి కళ్యాణి యాదగిర పర్యవేక్షణలో అంగడి బజారు"లియూత్ ఫర్ క్లీన్ తెలంగాణ" కార్యక్రమం కాలనీలో నిర్వహించి చెత్త చెదారం తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ మన చుట్టున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన యువతపై ఉంద న్నారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త చెదారం ఎక్కడబ డితే అక్కడ వేయకుండా తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి బండిలో వేసి పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. మన పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్ మాజీ సర్పంచ్ బండారి శైలజ ఆగి రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ యాదగిరి కౌన్సిలర్లు మధ్యల శ్రీనివాస్, బక్క రెడ్డి మాధవి యాదిరెడ్డి,తాళ్లపల్లి నరసింహులు, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పర్మిషన్ లేని పాఠశాలల్లో అడ్మిషన్ చేయకండి..

**పిడిఎస్యు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్..**



**చేవెళ్ళ మే 22( నినాదం):**
విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చే 2026 -27 విద్య అకాడమిక్ ఇయర్ లో పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ చేసే ముందు ఆ పాఠశాలకి పర్మిషన్ ఉందా? ఉంటే ఆ లెటర్ చూపించమని అడగండి బస్సులకు పర్మిట్ ఉందా లేదా తెలుసుకోండి. అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ అన్నారు. అదేవిధంగా పర్మిట్, పర్మిషన్, డ్రైవర్ లైసెన్స్, కావలసిన విధంగా లేకుండా బస్సులు నడిపితే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పిల్లల ప్రాణాలు పోతే తల్లిదండ్రులకే బాధగా ఉంటుంది. కాబట్టి 2009 విద్యాహక్కు చట్ట ప్రకారం కావలసిన అన్ని వసతులు ఉన్నాయా లేవా చూసి తెలుసుకోండి. నర్సరీ లో ఉండేది చిన్న పిల్లలు వాళ్లు ఆడుకోని అలసిపోయి నిద్రపోతారు. అలాంటి చిన్నపిల్లలకి చదువు చెప్పడానికి వ్యాపార ఆలోచనలతో ఉన్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు 40 వేల నుండి 60 వేల వరకు ఫీజులు తీసుకుంటూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫీజుల విషయంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు కల్లబొల్లి మాటలు చెప్పి రకరకాల పేరుతో ఇష్టం వచ్చినట్టు ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు అలాంటి పాఠశాలలా గుర్తింపు రద్దు చేసి వాటి పైన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులను అడ్మిషన్ చేసే ముందే కట్టిన ప్రతి ఫీజు కి రిసిప్ట్ తీసుకోండి. పిల్లలకి మంచి భవిష్యత్తు ఉండాలని మంచి చదువు చదివించాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది రాజకీయ నాయకులు విద్యని వ్యాపారంగా మార్చి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అనేక రకాల పేర్లతో సీబీఎస్ఈ అని ఇంటర్నేషనల్ స్కూల్ అని కొత్త రకమైనవి పెట్టి అత్యధిక ఫీజులతో విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బంది పెడతారు. పర్మిషన్ లేకుండానె ఆన్లైన్లో అడ్మిషన్లు తీసుకుంటున్న కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ జిల్లాలో చాలా ఉన్నాయి. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల భద్రత కోసం ఆలోచించాల్సిన అవసరం ఉంది. కాబట్టి పర్మిషన్ లేని స్కూల్ లలో తమ పిల్లలను అడ్మిషన్ చేయకండి. అని అన్నారు...

## వేతనాల పెంపులో శాస్త్రీయత లేదు

- పెరిగిన ధరలకు అణుగుణంగా కనీస వేతనాలు పెంచాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య



**కొడంగల్, మే 22(నినాదం)**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న సచివాలయంలో కార్మిక శాఖ పరిధిలోని షెడ్యూల్డ్ ఎంప్లామెంట్స్ లో కనీస వేతనాల పెంపుదలను ప్రకటించడం శాస్త్రీయంగా లేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. సుమారు 14 సం॥ల తరువాత రాష్ట్రంలో కనీస వేతనాలు సవరించడం అభినందనీయమన్నారు. ప్రకటించిన వేతనాలు పెరిగిన ధరలకు, అణుగుణంగా లేవని, కార్మికులు, కార్మిక సంఘాల చేసిన డిమాండ్ లను పరిగణలోకి తీసుకోలేదని తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. వేతనాల పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని, దేశానికే ఆదర్శవంతంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి మాటలు ఆచరణలో చూస్తే శాస్త్రీయత లోపించిందన్నారు.. ఆశాస్త్రీయమైన పద్ధతిలో వేతానాలను ప్రకటించారని, పెరిగి ధరలకు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలను మున్సిపల్ కార్పొరేషన్స్, మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాలుగా విభజించి వేతనాలు వేరువేరుగా ప్రకటించడాన్ని ఆయన వ్యతిరేకించారు. పెరిగిన వేతనాలు 4 క్యాటగిరీలో అన్ స్కిల్డ్ వర్క్ రూ.16,000, సెమిస్కిల్డ్ వర్క్ రూ.17,000, స్కిల్డ్ వర్క్ రూ.18,500, హైస్కిల్డ్ వర్క్ రూ.20,000లు పెంచినట్లుగా ముఖ్య మంత్రి ప్రకటించారని, ఇందులో ఒక్క అన్ స్కిల్డ్ వర్క్ తప్ప మిగితా వారికి బేసిక్ కరువుభత్యం కలుపుకొని ఇప్పటికే వస్తున్న జీతానికి పెరిగిన దానికి పెద్ద తేడా లేదని లెక్కతేల్చారు.. కార్మిక సంఘాలు, కనీస వేతనాల సలహామండలి సిపార్సులను పరిగణలోకి తీసుకోకుండా మంత్రివర్గ ఉపసంఘం పేరిట కనీస వేతనాలు ప్రకటించారని, ప్రభుత్వం కనీస వేతనం రూ. 26,000 లుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

## గ్రామాల్లో కనిపించని అధికారులు..

- సేవల కోసం ప్రజల పాట్లు..
- నేలకొండపల్లిలో కార్యదర్శులు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో అందు బాటులో లేరని ఆరోపణ



**పాలేరు మే 22( నినాదం)**
నేలకొండపల్లి,ప్రభుత్వ సేవలు గ్రామీణ ప్రజలకు అందాల్సిన చోటే అధికారుల జాడ లేకపోవడంతో నేలకొండపల్లి మండలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**ఫోన్ చేస్తే మండల్ ఆఫీస్ సమాధానం:**
స్థానికుల కథనం ప్రకారం, ఏదైనా ధ్రువపత్రం కోసమో, సమస్య పరిష్కారం కోసమో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్తే కార్యదర్శులు అందుబాటులో ఉండటం లేదు. ఫోన్‌లో సంప్రదిస్తే మండల్ ఆఫీస్ పనిమీద వెళ్లాను" అని చెప్పి తప్పించుకుంటున్నారని పలువురు గ్రామస్తులు తెలిపారు. నిజంగా అధికారిక పనిమీద వెళ్తున్నారా లేక వ్యక్తిగత పనులపై వెళ్తున్నారా అని తెలుసుకునే వ్యవస్థ లేకపోవడంతో ప్రజలకు సేవల్లో జాప్యం జరుగుతోంది.

**వైద్య సేవలకూ అదే పరిస్థితి:**
గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గ్రామస్థాయిలోనే ప్రాథమిక వైద్య సేవలు అందించాల్సిన ఏఎన్ఎంలు కూడా నిర్ణీత సమయంలో అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు ఉన్నాయి. టీకాలు, ఆరోగ్య పరీక్షల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.

**బయోమెట్రిక్ హాజరే పరిష్కారమా?**
ఉద్యోగుల హాజరులో పారదర్శకత కోసం బయోమెట్రిక్ విధానం తీసుకురావాలని మండల ప్రముఖులు, విద్యావంతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉదయం కార్యాలయానికి వచ్చినప్పుడు, సాయంత్రం వెళ్లేటప్పుడు బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తే విధుల పట్ల బాధ్యత పెరుగుతుందని వారి అభిప్రాయం. ఈ విధానాన్ని పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బందికి వర్తింపజేయాలని సూచిస్తున్నారు.

**అధికారులు దృష్టి సారించాలి:**
గ్రామ పాలనను బలోపేతం చేయడానికి నియమించిన సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు అంటున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి నేలకొండపల్లి మండలంలో ఆకస్మిక తనిఖీ లు చేపట్టాలని కోరుతున్నారు. విధులకు సక్రమంగా హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సేవలు నిరంతరాయంగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సిటీ కాలేజీకి 'ప్లాటినమ్ సస్టైనబుల్ క్యాంపస్ పార్ట్నర్' గుర్తింపు..



**హైదరాబాద్ ప్రతినిధి, మే 22 (నినాదం)..**
పర్యావరణ పరిరక్షణ, హరిత కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ సిటీ కళాశాలకు 'ప్లాటినమ్ సస్టైనబుల్ క్యాంపస్ పార్ట్నర్' జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.సిహెచ్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారత్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ -- జాతీయ సుస్థిర క్యాంపస్ మిషన్ 2026'లో భాగంగా ఈ అవార్డును ప్రకటించారన్నారు. గత ఏప్రిల్ 22 నుండి 29, 2026 వరకు నిర్వహించిన ధరిత్రి వారోత్సవాల సందర్భంగా కళాశాలలో చేపట్టిన పర్యావరణ కార్యక్రమాలకుగాను ఈ గుర్తింపు దక్కిందని అన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ సిటీ కళాశాల క్యాంపస్‌లో ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అనుగుణంగా మొక్కలు నాటడం, నీటి పొదుపు, పరిశుభ్రత నిర్వహణ, విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు కళాశాలకి ఈ అవార్డు లభించిందని వివరించారు. జూన్ 1న హైదరాబాద్ గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరగబోయే 'సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2026' సదస్సుకు హాజరుకావలసిందిగా ఆహ్వానం అందిందని తెలిపారు.
ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించడంలో కీలక పాత్ర పోషించిన ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్.నాగరాజు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లను, స్వచ్ఛందంగా పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థులలో పర్యావరణ బాధ్యతను పెంపొందించడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావడం తమ విద్యాసంస్థకు ఎంతో గర్వకారణమని వారు పేర్కొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : కరికే శ్రీనివాస్

**చేవెళ్ళమే 22( నినాదం):**



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని చేవెళ్ల బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కరికే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన ద్వారా రైతు రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సాయం, యువతకు ఉద్యోగాల అంశాల్లో ప్రజలు నిరాశకు గురవుతున్నారని తెలిపారు. రైతులు, నిరుద్యోగులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో అన్యాయం చేస్తోందని ఆరోపించారు. బి ఆర్ ఎస్ పాలనలో సాగునీరు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం లభించిందని పేర్కొంటూ తెలంగాణ హక్కుల సాధన కోసం తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

**భీమదేవరపల్లి మే 22 (నినాదం):**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డేపల్లి లక్ష్మి (55), భర్త శాంతయ్య అనారోగ్య సమస్యలతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, వడ్డేపల్లి లక్ష్మి కొంతకాలంగా తన భర్త శాంత య్యతో కలిసి హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతం లో నివసిస్తోంది. శాంతయ్య ఆరోగ్యం కొంతకాలంగా బాగా లేకపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారని, ఇందు కోసం భారీగా ఖర్చు చేసినప్పటికీ ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో లక్ష్మి తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలిసింది. ఈ క్రమంలో మనస్థాపానికి లోనైన లక్ష్మి మాదాపూర్ నుంచి స్వగ్రామమైన ముత్తారంకు వచ్చి, శుక్రవారం ఉదయం తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి భర్త వడ్డేపల్లి శాంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో ఈ ఘటన విషాద ఛాయలు నింపింది.



## పెయింటర్ దారుణ హత్య

**జవహర్ నగర్ , మే 22(నినాదం ):**
పెయింటర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్హెచ్ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం...ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం గోరఖ్పూర్ నుంచి నగరానికి వలస వచ్చి జవహర్ నగర్ లోని అంబేద్కర్ నగర్ దొండతోటలో అనిల్ కుమార్ (43) నివాసముంటున్నాడు. పెయింటింగ్ కాంట్రాక్టర్గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనిల్ కుమార్ నివసించే గదిలో నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు... పరిశీలించగా కుళ్ళిన స్థితిలో మృతదేహం కనిపించింది. అనిల్ కుమార్ స్నేహితులతో కలిసి మద్యం తాగిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయని... ఆర్థిక తగాదాలు లేక ఇతరత్రా కారణాలతో హత్యకు దారితీసి ఉండోచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. కర్రలతో కొట్టి చంపినట్లు కనిపిస్తుందని.... గత నాలుగు రోజుల క్రితమే చంపేసినట్లు కనిపిస్తుందని తెలిపారు. క్లూస్ టీం,డాగ్ స్క్వాడ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించా మని తెలిపారు. ఇంటి యజమాని అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కరెంట్ సమస్యలతో తగలబడుతున్న ఇండ్లు

**రాజేంద్రనగర్,మే 22 (నినాదం):**
కిస్మత్పూర్ ఫీడర్ పరిధిలో కరెంట్ సమస్యల తో ఇల్లు తగలబడుతున్నాయి కరెంటు వచ్చి పోతున్నాంతో ఇండ్లలోని వైర్లు కరెంటు షాక్ కు గురై ఇంట్లోని వస్తువులు తగలబడుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు ఈ విషయమై గతంలో అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదన్నారు. మెడిసిటీ కాలనీ కి ట్రాన్స్ఫారం లేదని తద్వారా ఓవర్ లోడ్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కాలనీవాసులు తెలిపారు కరెంటు సమస్యలను పట్టించుకోవడంలేదని అధికారుల తీరు పట్ల స్థానికులు నిరాశకు గురవుతున్నారు.



## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**రాజేంద్రనగర్, మే 22 (నినాదం):**
పార్కులో అక్రమ నిర్మాణాలను జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. చింతకుంట పార్కు పక్కన ఉన్న పార్కులో మసీదు కమిటీ వారు అక్రమ నిర్మాణం చేపడుతున్నారు చింతకుంట వాకర్ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు, జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు దీంతో వారు పార్కులో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇందుకు అధికారులకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.